నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
18వ వసంతంలోకి...
ఎన్టీఆర్ - కృష్ణా
బుధవారం 5 ఫిబ్రవరి 2025 పేజీలు 8




నందిగామ మున్సిపల్ చైర్ పర్సన్‌గా

# మండవ కృష్ణకుమారి

- ఆర్డీవో బాలకృష్ణ ఎన్నికల అధికారిగా కమిషనర్ రమణ బాబు పర్యవేక్షణలో ఎన్నికలు
- 15 మంది ఓట్ల బలంతో మున్సిపాలిటీపై కూటమి జెండా
- అభివృద్ధిపథంలో మున్సిపాలిటీని ముందుకు తీసుకెళ్తాం : ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య
- అందరికీ కృతజ్ఞతలు తెలియజేసిన చైర్మన్ మండవ కృష్ణకుమారి శ్రీనివాస్

8

రెవెన్యూ సదస్సులతో..

# శాశ్వత పరిష్కారం

96 శాతం అర్జీలను పరిష్కరించాం

తక్షణమే పరిష్కారం కాని సమస్యలను ప్రత్యేక ప్రణాళికతో పరిష్కారానికి కృషి : జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ 2

















## మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

### ఐవీఎం డైరెక్టర్ వేములపల్లి రోజా

**చల్లపల్లి మేజర్ న్యూస్:** మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని పురిటగడ్డకు చెందిన ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ డైరెక్టర్ వేములపల్లి రోజా ఆకాంక్షించారు. చల్లపల్లి మండలం వక్కలగడ్డ కు చెందిన కమల నెహ్రూ మహిళా మండలి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని రోజా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి లో శిక్షణ పొందితే కుటుంబాన్ని ఆర్థికంగా బలోపేతం చేసుకోవడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా పయనించేందుకు గతంలో ఇండియా విలేజ్ మినిస్టర్స్ సంస్థ ద్వారా అనేక కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. మహిళలు స్వశక్తితో ఎదిగేందుకు దోహదపడే విధంగా కమల నెహ్రూ మహిళా మండలి ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ శిబిరంలో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ సంస్థ ద్వారా సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ వేములపల్లి సురేష్, గ్రామ సర్పంచ్ వల్లూరి ఉమా, వేములపల్లి విజయ,మహిళా సమైక్య నాయకులు మల్లుపెద్ది రత్న కుమారి, హనుమానుల రాణి కుమారి, శిక్షకురాలు నాగమణి ప్రముఖులు కంఠం నేని రాజగోపాల్, శరత్ బాబు, హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, పాలడుగు రత్నబాబు, మల్లు పెద్ది బోసు, కృష్ణ కుమారి,కమల నెహ్రూ మహిళా మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## హలో మాదిగ - చలో హైదరాబాద్ పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్



**జగ్గయ్యపేట,ఫిబ్రవరి 4, మేజర్ న్యూస్ :** ఈనెల 7 వ తేదీన హైదరాబాదులో జరిగే హలో మాదిగ – చలో హైదరాబాద్ లో భాగంగా వెయ్యి గొంతులు, లక్ష డప్పుల మహాసభ వాల్ పోస్టర్లను జగ్గయ్యపేట పట్టణంలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ నివాసంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు మాతంగి దావీదు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్( తాతయ్య) చేతుల మీదుగా పోస్టర్లను ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నకిరకంటి వెంకట్, ముండ్లపాటి ప్రసాద్ (మాస్టారు), కారుపాటి దేవిడ్, మారేపల్లి శౌరి, మల్లెల కొండయ్య, మార్నపుడి వంశీ, అన్నెపాక దుర్గా మహేశ్వర రావు, ముండ్లపాటి రాము, బోయ రంజిత్,అన్నెపాక శేఖర్ బాబు, కోట ప్రబోజి తదితరులు పాల్గొన్నారు.

## నులిపురుగుల నిర్మూలనకు చర్యలు చేపట్టాలి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** జిల్లాలో పిల్లల్లోని నులిపురుగుల నిర్మూలనకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. ఫిబ్రవరి 10వ తేదీన జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం సందర్భంగా మంగళవారం ఆయన కలెక్టరేట్లోని తన ఛాంబర్ లో వైద్య, విద్య అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రక్తహీనత (అనీమియా), పోషకాహార లోపాన్ని అధిగమించి ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులిపురుగుల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. ఆ రోజున ఒకటి నుండి 19 సంవత్సరాల వయస్సు లోపు పిల్లలు, కిశోర బాలలకు ఆల్బెండజోల్ మాత్రలు అంగన్వాడి, పాఠశాలలు, కళాశాలలో ఉచితంగా అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.ఏ వయసు వారికి ఎంత డోసు మాత్రలు ఇవ్వాలనేది ఏఎన్ఎం, ఆశా, అంగన్వాడి కార్యకర్తలకు అవగాహన కల్పించి మాత్రలు సక్రమంగా పంపిణీ చేసేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా ఆయన నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం అవగాహన గోడపత్రికలను ఆవిష్కరించారు.ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఎస్ శర్మిష్ట, ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ప్రేమ్ చంద్, డీఈవో పీవీజే రామారావు, వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ సదస్సులతో శాశ్వత పరిష్కారం



**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 04, మేజర్ న్యూస్ :** జిల్లాలో 33 రోజుల పాటు జరిగిన రెవెన్యూ సదస్సుల్లో మొత్తం 3,111 పిటిషన్లు రాగా 3,015 అర్జీల పరిష్కారం (96 శాతం) పూర్తయిందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. మంగళవారం సీసీఎల్ఏ జి.జయలక్ష్మి అన్ని జిల్లాల కలెక్టర్లతో రెవెన్యూ సదస్సుల పిటిషన్ల పరిష్కారం, పీజీఆర్ఎస్–రెవెన్యూ అర్జీల పరిష్కార పురోగతి తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీసీకి కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులతో కలిసి హాజరయ్యారు. జిల్లాలో అర్జీల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు, పురోగతిని వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ అర్జీ అందుకున్నప్పుడే క్షుణ్నంగా పరిశీలించి.. సంబంధిత క్షేత్రస్థాయి అధికారులతో నేరుగా లేదా వర్చువల్‌గా మాట్లాడి తగిన సూచనలు ఇవ్వడంతో పాటు వివిధ శాఖల అధికారుల పటిష్ట సమన్వయం, సమర్థవంతమైన ఆడిటింగ్ వంటి చర్యలు అర్జీల పరిష్కారంలో జిల్లాను మెరుగైన స్థానంలో నిలుపుతున్నట్లు వివరించారు. నోడల్ అధికారులు కూడా ఎప్పటికప్పుడు అర్జీల పరిష్కారంపై ప్రత్యేకంగా దృష్టిసారిస్తున్నట్లు తెలిపారు. రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్ఓఆర్)కు సంబంధించి 105 అర్జీలు నమోదు కాగా ఇప్పటికే 102 అర్జీలను పరిష్కరించినట్లు వెల్లడించారు. అదేవిధంగా రీసర్వేకు సంబంధించి 148 గ్రీవెన్స్‌కు గాను 137 అర్జీల పరిష్కారం పూర్తయినట్లు తెలిపారు. ప్రభుత్వ భూముల అసైన్‌మెంట్‌కు సంబంధించి 8 గ్రీవెన్సులు రిజిస్టర్ కాగా ఏడింటిని పరిష్కరించామన్నారు.

ఇంటి స్థలాల అసైన్‌మెంట్‌కు సంబంధించి 272 గ్రీవెన్సులు రిజిస్టర్ కాగా 269 అర్జీలను పరిష్కరించినట్లు వివరించారు. 22ఏలో చేర్చడం లేదా తొలగించడానికి సంబంధించి 105 పిటిషన్లు రాగా 102 పిటిషన్లను పరిష్కరించినట్లు తెలిపారు. మిగిలిన వాటి పరిష్కారంలో ఉన్న అడ్డంకులను తొలగించి, వాటిని కూడా త్వరితగతిన పరిష్కరించేందుకు కృషిచేస్తున్నట్లు కలెక్టర్ డా. జి.లక్ష్మీశ వివరించారు. ఈ సమావేశంలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, గ్రామ,వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, కలెక్టరేట్ ల్యాండ్ సెక్షన్ సూపరింటెండెంట్ సీహెచ్ దుర్గాప్రసాద్, కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పదవులు ప్రజా ఉద్యమ నాయకులకు ఇవ్వాలి

### దళిత బహుజన ఉద్యమ నేతలు డిమాండ్



**విజయవాడ, మేజర్ న్యూస్ :** ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ నియామక పదవులు దళిత బహుజన ఉద్యమ నాయకులకు ఇవ్వాలని దళిత బహుజన ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.మంగళవారం విజయవాడ ప్రెస్ క్లబ్ లో జరిగిన దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యవర్గ విస్తృత సమావేశం లో వివిధ దళిత బహుజన ఉద్యమ సంఘాల నాయకులు పాల్గొని ప్రసంగించారు. ఈ సమావేశానికి దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు అంగదాల పూర్ణచంద్ర రావు అధ్యక్షత వహించారు. ఏపీ రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి, వైసిపి పార్టీని ఓడించడానికి దళిత బహుజన గిరిజన ప్రజా సంఘాల విస్తృతంగా కృషి చేశాయని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ అధ్యక్షులు కొరివి వినాయకుమారు సమావేశంలో వివరించారు. జగన్ పార్టీ, ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించిన పార్టీ యేతర నాయకులకు ప్రభుత్వ పదవులు లో భాగస్వామ్యం ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దళిత వేదిక రాష్ట్ర అధ్యక్షులు వంగిపురపు రెడ్డన్న మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం రద్దు చేసిన దళితుల 27 పథకాలు ఈ ప్రభుత్వ పునర్దరించాలని, ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు ద్వారా వీరికి అభివృద్ధి కార్పొరేషన్ ల ద్వారా ప్రత్యేక పథకాలు అమలు జరపాలని డిమాండ్ చేశారు. దళిత బహుజన ఫ్రంట్ జాతీయ ప్రధాన కార్యదర్శి మేళం భాగ్య రావు మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ ల రక్షణ చట్టాలను ప్రభుత్వాలు పటిష్టంగా అమలు జరపాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వ విధానాలు, పథకాలు పర్యవేక్షణ కోసం మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేయాలని సమావేశం తీర్మానించింది. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల రాజ్యాంగ హక్కులను కాపాడుకునేందుకు స్థానిక నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సమావేశం నిర్ణయించింది. 30 శాతం ప్రభుత్వ పదవులు ప్రజా ఉద్యమ నాయకులకు ఇవ్వాలని సమావేశం నిర్ణయించింది. ఈ సమావేశంలో దళిత బహుజన ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బుస్సా రత్న ప్రసాద్, గిరిజన ఉద్యోగ సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు కొమ్మరగిరి శ్రీనివాస రావు, బిసి సంఘాల నాయకులు కె.రంగనాథ, బి. కిషోర్, మహిళా నేత కె. రాణి, వేల్పుల జ్యోతి, యువజన నాయకులు కోసనం రాము, వ్యవసాయ వృత్తి దారుల యునియన్ అధ్యక్షులు ఇనాపురపు సూర్య నారాయణ, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ సమన్వయ కర్త కె.చెంగల రావు, పి.ఓబయ్య, వివిధ జిల్లాల అధ్యక్షులు పాల్గొన్నారు.

# జై భీమ్ మహిళా సంఘానికి స్థలం కేటాయించండి





**కంచికచర్ల ఫిబ్రవరి 4 మేజర్ న్యూస్ :** స్థానిక జై భీమ్ మహిళా సంఘానికి అంబేద్కర్ కాలనీలోని పోరంబోకు స్థలాన్ని కేటాయించాలని రాష్ట్ర జై భీమ్ మహిళా సంఘ అధ్యక్షురాలు దెయ్యాల జోజి మేరి కోరారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన ద్వారా తెలియజేస్తూ జోజి మేరి అంబేద్కర్ కాలనీలో ఉన్నటువంటి పంచాయతీ పోరంబోకు ఖాళీ స్థలం జై భీమ్ మహిళా సంఘం సొసైటీ కి కేటాయించాలని కమిటీ సభ్యుల తో కలిసి కోరారు.అంబేద్కర్ కాలనీ ప్రజలందరూ కలిసి ఆ స్థలంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నీలిరంగు జెండాలు, కమిటీ సభ్యుల బ్యానర్లు ఏర్పాటు చేశారు. ఈ విషయమై గత ప్రభుత్వంలో సొసైటీకి స్థలాన్ని కేటాయించాలని కోరడం జరిగిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో కూడా అధికారులకు అర్జీలు పెట్టడం జరిగిందని తెలిపారు. కాగా ప్రస్తుత పంచాయతీ సర్పంచ్ భర్త మా సంఘం ఎదుగుదల ఓర్వలేక ఈ స్థలాన్ని కబ్జా చేయాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన అనుచరుల ద్వారా ఈ స్థలాన్ని ఆక్రమించాలని ప్రయత్నిస్తున్నారని,మమ్మల్ని బెదిరిస్తున్నారని వారు వాపోతున్నారు. ఆయనకి లాగా ఏ ఎండకి ఆ గొడుగు పట్టటం పార్టీలు మార్చడం మనుషులను మార్చడం మాకు అలవాటు లేదని అన్నారు. ఈ భూమి విషయమై ఎంత దూరమైనా వెళతామని వెనుతిరిగే ప్రసక్తే లేదని ఘాటుగా స్పందించారు. త్వరలో కూటమి నాయకులందరినీ కలిసి ఈ స్థల విషయమై చర్చించి జై భీమ్ మహిళా సంఘం సొసైటీకి ఇప్పించవలసిందిగా మరొక్కసారి కోరతామని తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో పాలెం మేరమ్మ, గుడిబండ్ల ఈశ్వరి, మీసాల జ్ఞాన సుందరి, బర్రె బుజ్జి, కలతోటి సునీత, ఏదాల సంధ్య, బొడ్డు కొండమ్మ, దగ్గుపాటి అక్కమ్మ, బిత్ర పద్మ, గన్ తోటి శాంతి కుమారి, నీలం సుశీల, జక్కి సైలజ తదితరులు పాల్గొన్నారు.

# కుదరవల్లిలో కోడిపేగులు వ్యర్థాల నాలుగు వాహనాలను సీజ్ చేసిన నందివాడ ఎస్ఐ



**నందివాడ,మేజర్ న్యూస్:** మండల పరిధిలోని కుదరవల్లి గ్రామంలో కోడి పేగుల వ్యర్థాలతో వస్తున్నా ఐసర్ వాహనాలను సీజ్ చేసిన నందివాడ ఎస్సై కే.శ్రీనివాస్ కోడిపేగులు,గొడ్డుమాసం,పాడైపోయిన అన్నం ఇవి మండలంలో ఫంగస్ చెరువులకు సాగు కొరకు వినియోగించే ఎంతో ప్రమాదకరమైన వ్యర్థపదార్థాలు ఈ చేపలను మనం తింటే ఏమవుతుంది. వ్యర్థ పదార్థాలను సైతం వృధాగా కానివ్వకుండా చేపలకు మేతగా వినియోగిస్తున్నారు. ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారు. ఇటీవలే ఏలూరు జిల్లాలో పట్టుబడడంతో నందివాడ మండలాన్ని వాహన మార్గంగా మార్చుకొని అడ్డగోలుగా వేస్ట్ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నారు. తనకు అందిన సమాచారం మేరకు ఎస్.ఐ.శ్రీనివాస్ తన సిబ్బంధితో కోళ్ల వ్యర్థాల వాహనాలపై నిఘా పెట్టగా సోమవారం ఉదయం సమయంలో కుదరవల్లి గ్రామశివారుల్లో నాలుగు ఐసర్ వాహనాలు,వ్యర్థాలు సుమారు 40 టన్నులు తరలిస్తుండగా ఎస్ఐ శ్రీనివాస్ తన సిబ్బందితో కలిసి వాహనాలను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం సంబంధిత అధికారులు తాసిల్దార్ గురుమూర్తి రెడ్డి,స్థానిక వీఆర్వో కి, సమాచారం అందించి వారి సమక్షంలో పట్టుబడిన వ్యర్థాల వాహనాలను నాశనం చేయడం, వాహన డ్రైవర్ లైసెన్సులను రద్దు చేయడం జరిగిందని వ్యర్థాలతో సాగు చేస్తున్న ఫంగస్ చేపల చెరువులను గుర్తించి తగు చర్యలు తీసుకుంటామని తాశి ల్దార్ గురుమూర్తి రెడ్డి,, ఎస్.ఐ.శ్రీనివాస్ పేర్కొన్నారు.

## ఎన్నికల నియమాలను ఉల్లంఘించిన పోస్ట్ మ్యాన్ పి.వసంతరావుపై నేడు విచారణ



**జగ్గయ్యపేట: ఫిబ్రవరి 4 మేజర్ న్యూస్ :** పోస్ట్ మ్యాన్ విధులకు ఎగనామా పెట్టి ఆయన స్థానంలో మరొక ప్రైవేటు వ్యక్తిని అనధికారకంగా నియమించి వైసిపి పార్టీ ప్రచారంలో పాల్గొన్న పి వసంతరావు పై ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన ఫిర్యాదు మేరకు ఆయనపై ఎన్నికల అధికారులు విచారణ జరిపి సస్పెన్షన్ వేటు వేశారు. అయినప్పటికీ ఆయన తీరులో ఎటువంటి మార్పు లేకుండా అధికారుల ఆదేశాలను ఖాతరు చేయకుండా మరల అదే తరహాలో వైసిపి పార్టీ ప్రచారంలో పాల్గొనడం జరిగిందని ఫిర్యాదు దారుడు మహమ్మద్ జావిద్ తెలిపారు. ఈ విధంగా ప్రభుత్వ ఉద్యోగిగా ఉండి ఎన్నికల నియమావళిని పాటించకుండా ఉన్నతాధికారుల ఇచ్చిన సస్పెన్షన్ వేటు కూడా ఖాతరు చేయకుండా మరలా అదే తరహాలో ప్రచారంలో పాల్గొన్న పి వసంతరావు ను విధుల నుండి తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని జావిద్ ఫిర్యాదు మేరకు నేడు జిల్లా ఎన్నికల అధికారుల నుంచి ఎన్నికల రిటర్నింగ్ అధికారికి మండల పరిషత్ అధికారికి జగ్గయ్యపేట పోస్ట్మాస్టర్ కి మహమ్మద్ జావిద్ కు విచారణకు ఆదేశించినట్లు ఆయన తెలిపారు.

## కూటమి అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించండి

### పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్



**బంటుమిల్లి మేజర్ న్యూస్:** ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను భారీ మెజారిటీ సాధించేలా కృషి చేయాలని పెడన నియోజకవర్గ పరిధిలోని నాయకత్వం బాధ్యత వహించాలని శాసన సభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ కోరారు.మంగళవారం బంటుమిల్లి మండలం జానకిరా మపురం గ్రామంలో టిడిపి పార్టీ కార్యాలయం వద్ద టిడిపి, జనసేన, బిజెపి మండల అధ్యక్షులు కార్యదర్శులు, యూనిట్,క్లస్టర్ ఇన్చార్జీలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో పెడన నియోజకవర్గ శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్, పెడన నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు గొట్టుముక్కల రఘురామరాజు పాల్గొన్నారు. నియోజకవర్గంలోని ప్రతి మండలంలో 30మంది ఓటర్లకు ఒక ఇంచార్జ్ నియమించేలా మండల నాయకులు చూడాలని కోరారు. ఈ సమావేశంలో టిడిపి,జనసేన,బిజెపి మండల అధ్యక్షులు కార్యదర్శులు, యూనిట్,క్లస్టర్ ఇన్చార్జీలు,కూటమి నాయకులు పాల్గొన్నారు.

## పెండ్యాలలో పొలం పిలుస్తోంది



**కంచికచర్ల ఫిబ్రవరి 4 మేజర్ న్యూస్ :** పెండ్యాల గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రైతులకు పంట నమోదు అవశ్యకత, సబ్సిడీ తో అందుబాటులో ఉన్న కిసాన్రోన్ గురించి వివరించారు. వ్యవసాయ శాఖ అధికారులు విద్యార్థులు రైతులుతో కలిసి మొక్కజొన్న పొలాన్ని సందర్శించారు. మొక్కజొన్న పంట ఎలా సాగు చేస్తారు పంటలో మెలకువలు గురించి విద్యార్థిని విద్యార్థులకు వివరించారు ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి కే విజయకుమార్ గ్రామ నాయకులు, రైతులు పాల్గొన్నారు

## కృష్ణ - గుంటూరు ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో సాయి సిద్ధార్థ విద్యాసంస్థల అధినేత కందుల వెంకట్రావు



**కంచికచర్ల ఫిబ్రవరి 4 మేజర్ న్యూస్ :** పూర్వ విద్యార్థులు,ఈ ప్రాంత పట్టభద్రులు కోరిక మేరకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో నిలిచానని సాయి సిద్ధార్థ విద్యాసంస్థల అధినేత కందుల వెంకట్రావు తెలిపారు. మంగళవారం స్థానిక ఎన్జీవో భవనంలో విలేకరులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన గెలుపుకు పట్టభద్రులందరూ కృషి చేయాలని కోరారు. ఎంతోమంది పేద విద్యార్థులకు ఉచితంగా విద్యను అందించానన్నారు. ప్రస్తుతం నందిగామ కోచింగ్ సెంటర్ ఐఐటీ జేఈఈ విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.విద్యపరంగా విద్యార్థులకు ఎల్లప్పుడూ సహృదయంతో అందుబాటులో ఉంటా అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిస్తే ఏమి చేస్తారు అన్న ప్రశ్నకు ప్రతి రూపాయి విద్యకు దూరంగా ఉన్న విద్యార్థులకు చేరేలా కృషి చేస్తానని స్పష్టం చేశారు.నా జీతంలో నుంచి కూడా ప్రతి రూపాయి వారికే ఖర్చు చేస్తానని ఉద్ఘాటించారు.ఎమ్మెల్సీగా గెలిచిన వెంటనే కృష్ణ గుంటూరు ప్రాంతాలలో నిరుద్యోగులైన పట్టభద్రులకు ప్రభుత్వ,ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాలు ఇప్పించేందుకు అవిశ్రాంత కృషి చేస్తానని తెలిపారు. కృష్ణ, గుంటూరు ప్రాంతాల పట్టభద్రులు తనకు ఓటు ప్రాధాన్యతను కల్పించి గెలిపించవలసిందిగా అభ్యర్థించారు.

## నూతన వధూవరులను కుటుంబ సమేతంగా ఆశీర్వదించిన ఎమ్మెల్యే



**పామర్రు ఫిబ్రవరి 4 మేజర్ న్యూస్ :** పెద పారుపూడి మండలం యలమర్రు గ్రామ సర్పంచ్, తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు సూరపనేని సత్య నారాయణ కుమార్తె స్త్రీ చౌదరి రిసెప్షన్ వేడుకలకు పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా కుటుంబ సమేతంగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. మంగళగిరిలోని సి కె కన్వెన్షన్ హాల్లో జరిగిన ఈ వేడుకలలో తెలుగుదేశం పార్టీ పొలిటి బ్యూరో సభ్యులు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య, తన సతీమణి విశ్రమ లతో కలిసి నూతన వధూవరులను ఆశీర్వదించి వారికి శుభాకాంక్షలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమార్ రాజా తో పాటు జనసేన పార్టీ పామర్రు నియోజకవర్గ ఇన్చార్జ్ తాడిశెట్టి నరేష్, కృష్ణా డెల్టా ప్రాజెక్ట్ కమిటీ ఉపాధ్యక్షుడు వల్లూరుపల్లి గణేష్, గొట్టిపాటి లక్ష్మీ దాసు లతోపాటు పామర్రు నియోజక వర్గంలోని పలువురు నాయకులు పాల్గొన్నారు.

## అవగాహన ర్యాలీనీ ప్రారంభించిన డాక్టర్ శర్మిష్ట



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయము నుండి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని డాక్టర్ శర్మిష్ట జండా ఊపి ర్యాలీని ప్రారంభించారు ఈ కార్యక్రమంలో ఆరోగ్య శాఖ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు

## నంబర్ రక్షక్ కార్యక్రమాన్ని ప్రారంభించిన వి




**విజయవాడ మేజర్ న్యూస్ :** భారతదేశంలోని ప్రముఖ టెలికాం ఆపరేటర్ వి, మహా కుంభ్‌లో విడిపోయిన యాత్రికులను తిరిగి కలిపేందుకు వి నంబర్ రక్షక్' కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఎవరూ తమ వారిని కోల్పోయినట్లు, లేదా వారితో సంబంధాలు తెగిపోయినట్లు లేదా వెనుకబడిపోయినట్లు భావించకుండా చూసుకోవడానికి ఇది తోడ్పడుతుంది. వ్యక్తిగత అత్యవసర సంప్రదింపు నంబర్‌లతో చెక్కబడిన రుద్రాక్ష తులసి బ్రాస్‌లెట్‌లను అందిస్తోంది. స్వామి రామానంద్ ఆచార్య శిబిర్ అఖాడ, సమీప ప్రాంతాలకు సమీపంలో ఉన్న ప్రముఖ ప్రాంతంలో వి నంబర్ రక్షక్ బూత్‌ను ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమం యాత్రికులు మొబైల్ ఫోన్‌లు లేదా ఇంటర్నెట్ కనెక్టివిటీపై ఆధారపడకుండా తిరిగి కనెక్ట్ అయ్యే నమ్మకమైన మాధ్యమాన్ని కలిగి ఉండటానికి వీలు కల్పిస్తుందని వి చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ అవనీష్ ఖోస్లా పేర్కొన్నారు.

## కొత్త రికార్డు నెలకొల్పిన బీకేసీలోని శామ్‌సంగ్ ఫ్లాగ్‌షిప్ స్టోర్



**విజయవాడ మేజర్ న్యూస్ :** బాంద్రా కుర్లా కాంప్లెక్స్ (బీకేసీ)లోని శామ్‌సంగ్ ఫ్లాగ్‌షిప్ స్టోర్ కొత్త గ్యాలక్సీ ఎస్25 సిరీస్ విజయాన్ని ప్రత్యేక కార్యక్రమంతో జరుపుకుంది. ఇందులో డివైజుల ముందస్తు పంపిణీని ప్రారంభించి, ఇక్కడ 700 మందికి పైగా వినియోగదారులకు ఫోన్లు అందజేశారు. ఈ రికార్డ్ డెలివరీ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న స్మార్ట్‌ఫోన్ సిరీస్ యొక్క ప్రీ-ఆర్డర్ల కోసం విపరీతమైన ప్రతిస్పందనను అనుసరిస్తూ, అత్యంత ఆకట్టుకునే అంశంగా నిలిచింది. బీకేసీ స్టోర్ ప్రత్యేకంగా క్యూరేట్ చేసిన అనుభవాలు, నిజ జీవిత దృశ్యాల ద్వారా శామ్‌సంగ్ యొక్క అత్యుత్తమ ప్రీమియం ఉత్పత్తులను ప్రదర్శిస్తుంది. గ్యాలక్సీ ఎస్25 సిరీస్ డివైజులు శామ్‌సంగ్ యొక్క అత్యంత ఆధునిక ఫ్లాగ్‌షిప్ స్మార్ట్‌ఫోన్‌లు. ఇవి ఇప్పటి వరకు ఎ ట్రూ ఏఐ కంపానియన్ గా రూపొందించబడ్డాయి.

## అత్యంత వైభవంగా వేణుగోపాలుని విగ్రహ ప్రతిష్ట మహోత్సవం





**పామర్రు ఫిబ్రవరి 4 మేజర్ న్యూస్ :** పమిడిముక్కల మండలం ఐనంపూడి గ్రామంలో శ్రీ వేణుగోపాలస్వామి ఆలయాన్ని పునర్నిర్మించారు. ఈ ఆలయంలో శ్రీ వేణుగోపాలస్వామి, గోదాదేవి, శ్రీ ఆంజనేయ స్వామి, గరుడ మూర్తి తదితర విగ్రహాల ప్రతిష్టా కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఆచార్య పరాశరం కృష్ణప్రసాద్ యాజ్ఞీకంలో వైఖానస ఆగమ శాస్త్ర విధానంలో వేదమంత్రోచ్చారణల నడుమ అత్యంత వైభవంగా, భక్తుల కోలాహలం నడుమ ఈ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం సాగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఆలయ శిఖర ప్రతిష్ట, నూతన ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమాలను కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం వాసుదేవ నామంతో మారుమోగింది.

### కన్నుల పండుగగా వేణుగోపాలుని కళ్యాణం

ఈ సందర్భంగా ఆలయంలో వేణుగోపాలస్వామి కళ్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించగా భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని ఈ కళ్యాణాన్ని తిలకించి తన్మయులయ్యారు. దేవాలయం పునఃనిర్మాణం తర్వాత తొలిసారిగా నిర్వహించిన ఈ కళ్యాణ మహోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కళ్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలను స్వీకరించారు.




## ప్రజలకు నిరంతరం చేరువగా 'నేటి దినపత్రిక సూర్య'

### తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బూరగడ్డ వేదవ్యాస్

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** నిరంతరం అందరికి చేరువగా ఉంటూ ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని, వార్తల రూపంలో ప్రజలకు, అందించే 'నేటి దినపత్రిక సూర్య' పాఠకుల అభిమానాన్ని చూరగుంటోందని, మాజీ డిప్యూటీ స్పీకర్, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు బూరగడ్డ వేదవ్యాస్ అన్నారు. మంగళవారం ఆయన నివాసంలో 'నేటి దినపత్రిక సూర్య' క్యాలెండర్లను, డైరీలను, ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'నేటి దినపత్రిక సూర్య' క్యాలెండర్లు,డైరీలు ఆకర్షణీయంగా ఉన్నాయని వేదవ్యాస్ ప్రశంసించారు. నిరంతరం వార్తలను సేకరించడంలో, సేకరించిన వార్తలను పాఠకులకు అందించడంలో, 'నేటి దినపత్రిక సూర్య' యాజమాన్యం, సిబ్బంది ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. నాణ్యత, మన్నికతో చదువరులకు ఎప్పటికప్పుడు చక్కటి సమాచారాన్ని, కథనాలను, అందించే 'నేటి దినపత్రిక సూర్య' ప్రజా హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. 'నేటి దినపత్రిక సూర్య' కృష్ణాజిల్లా స్టాఫ్ రిపోర్టర్, జిల్లా మేనేజర్ కూరేటి సతీష్,బి శంకర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## బందరు నుంచి ప్రత్యేక బస్సుల ద్వారా కుంభమేళాకు యాత్రికులు




**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ప్రయాగరాజ్‌లో జరుగుతున్న కుంభమేళాకు మచిలీపట్నం ఆర్టీసీ వారి సౌజన్యం లో రెండు బస్సులు ఈరోజు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి డిపో మేనేజర్ టీ పెద్దిరాజు,అసిస్టెంట్ మేనేజర్ ఎం ఎం ప్రసాద్, జెండా ఊపి ప్రారంభించారు. డ్రైవర్ జి దేవా సీనియర్ డ్రైవర్‌ని ఏర్పాటు చేశారు. బస్సులోనే ఒక వంట మేస్త్రి భోజనం సదుపాయం కూడా ఏర్పాటు చేశారు. వారం రోజులపాటు యాత్ర దర్శనాలు పూర్తిచేసుకుని మరల ఇవి మంగళవారం అనగా ఏడు రోజులకు తిరిగి సురక్షితంగా రావాలని కోరుకుంటూ బంధుమిత్రులు అందరూ హాజరై కుంభ మేళాకు వెళుతున్న భక్తులకు శుభాకాంక్షలు తెలిపి వీడ్కోలు పలికారు భక్తులకి ఇటువంటి సౌకర్యం కలగజేసిన డిపో మేనేజర్‌కి ధన్యవాదాలు తెలిపారు. ఆర్టీసీ సిబ్బంది ప్రయాణికులకు అందరికీ అభినందనలు తెలియజేసారు.

## ఆరోగ్య సూత్రాలు పాటించండి..

### గ్రామీణ వైద్యుల విభాగం అధ్యక్షులు నాగేశ్వరరావు



**నందిగామ, ఫిబ్రవరి 4, మేజర్ న్యూస్:** ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్యాన్సర్ మహమ్మారిని ఎంతోమంది అభాగ్యులు తన ప్రాణాలను కోల్పోయారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మనుషులలో అనేక మార్పులు వస్తా ఉన్నాయని మానవ జీవనంలో అనేక విధాలు గా పని ఒత్తుళ్ళు, ఆరోగ్య సూత్రాలు పాటించకపోవడం తినే ఆహార విధానంలో మార్పులు రావడం అనేక అనేక ఇతర కారణాలవల్ల మానవ జీవన విధానంలో అనేక మార్పులతో పాటు రోగ నిర్ధారణ శక్తి తగ్గి క్యాన్సర్ రూపేనా ఎందరో ప్రాణాలను బలి తీసుకుంది. పట్టణ గ్రామీణ ప్రాంత ప్రజలకు అనేక రకాల సేవలు చేసేటటువంటి గ్రామీణ వైద్య విభాగంలో ని ఆర్ఎంపీ డాక్టర్లు ప్రజలకు క్యాన్సర్ పై అవగాహన కలిగిస్తూ ఆరోగ్య సూత్రాలు పాటించాలని క్యాన్సర్ మహమ్మారి నుండి ప్రతి ఒక్కళ్ళు దూరంగా ఉండాలని జంక్ ఫుడ్ అంటే పానీ పూరి ఫైడ్ రైస్ మంచూరియా కొన్ని కొన్ని ఆహార అలవాట్లను తగ్గించుకొని ఆరోగ్య సూత్రాలు పాటించి క్యాన్సర్ మహమ్మారికి దూరంగా ఉండాలని నందిగామ డివిజన్ గ్రామీణ వైద్య విభాగం రాష్ట్ర నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో,ఉమ్మడి కృష్ణా జిల్లా కార్యదర్శి ఎస్కే జల్లుద్దీన్ సహాయ కార్యదర్శి పి శ్రీనివాసరావు ప్రచార కార్యదర్శి పి శ్రీనివాసరావు గ్రామీణ వైద్యులు ఎన్ ప్రతాప్ విజయ్ కృష్ణా రెడ్డి ఎలమద్ది రంగారావు మొదలైన గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు.

# ఈ ఐదేళ్లలో అభివృద్ధి చెందిన గుడివాడను చూస్తారు

## విజయవాడ రోడ్డులోని పలు ప్రాంతాల్లో పర్యటించిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



**గుడివాడ, మేజర్ న్యూస్:** ఈ ఐదేళ్లలో అభివృద్ధి చెందిన గుడివాడను చూస్తారని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రజలకు అభయమిచ్చారు. స్థానిక ప్రజల నుండి వచ్చిన విజ్ఞప్తుల మేరకు గుడివాడ విజయవాడ రోడ్డులోని సాయినగర్ లో ఎమ్మెల్యే రాము మంగళవారం ఉదయం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే రాముకు వివరించారు. కాలనీ ఏర్పడి 35 ఏళ్లు గడిచినా నేటివరకు రోడ్లు వెయ్యలేదన్నారు. వీధిలైట్లు కూడా సరిగ్గా వెలిగే పరిస్థితి లేదన్నారు. ఇంకా పలుసమస్యలను కాలనీ వాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా అధికారులతో తక్షణమే మాట్లాడి సమస్యలను వేగంగా పరిష్కారం అయ్యేలా చూస్తానన్నారు. అన్నట్టుగానే అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం చెంచుపేట, రైలు పేట ఏరియాల్లో ఎమ్మెల్యే రాము పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులను ఉద్దేశించి మాట్లాడుతూ... ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను పరిష్కరించడం నా కర్తవ్యంగా భావిస్తానని పేర్కొన్నారు. గత పాలుకుల స్వార్థంతో గుడివాడ ఎంతో వెనకబడిపోయిందన్నారు. గుడివాడలో ప్రాధాన్యత దృష్ట్యా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మార్చి నెలలో పట్టణంలోని శివారు కాలనీలతో పాటుగా, అభివృద్ధికి నోచుకోని పలు ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం అవుతాయని ఎమ్మెల్యే రాము తెలియచేశారు. ఎమ్మెల్యే రాము పర్యటనలో స్థానిక టిడిపి నాయకులు పైడిముక్కల వంశీ, నీరుడు సురేష్, అమిర్ భాష, మీరావలి, నాని, తదితరులు పాల్గొన్నారు.

## తడి-పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాల్సిందే.



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనలో భాగంగా తడి-పొడి చెత్తను పారిశుద్ధ్య సిబ్బంది వేర్వేరుగా సేకరించాల్సిందేనని.. వేర్వేరు బిన్స్‌లో తడి-పొడి చెత్తను వేరు చేసి అందించే విషయంపై ప్రజలకు కూడా సచివాలయ స్థాయిలో పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులు,సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ డీకే బాలాజీ,మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వివిఎస్ బాపిరాజుతో కలిసి మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని 24వ డివిజన్ పాత రామన్నపేటలో పర్యటించారు. నగరంలో ఇంటింటికీ వెళ్లి మున్సిపల్ సిబ్బంది తడి- పొడి చెత్తను సేకరిస్తున్న తీరును స్వయంగా పరిశీలించారు. కొన్నిచోట్ల తడి పొడి చెత్తను ఒకే డస్ట్ బిన్‌లో వేయడాన్ని చూసి మున్సిపల్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ప్రజలకూ చెత్తను వేరుచేసి అందించే విషయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ మునిసిపల్ సిబ్బంది గృహాల నుంచి తడి-పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని, వ్యర్థాల నిర్వహణ విషయంలో క్రమశిక్షణా రాహిత్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు. వార్డు సచివాలయం యూనిట్‌గా సిబ్బంది. ప్రజలకు చెత్త నిర్వహణపై అవగాహన కల్పించాలని, మనిషి ఆరోగ్యానికి, పర్యావరణ పరిరక్షణకు వీలుకల్పించే స్వచ్ఛత ప్రాధాన్యాన్ని తెలియజెప్పాలని ఆదేశించారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ పడేయకుండా చేసిన ఏర్పాట్లు కూడా మంచి ఫలితాలిస్తున్నాయని.. ఇదేవిధమైన పర్యవేక్షణను ముందు కూడా కొనసాగించాలన్నారు. హాట్‌స్పాట్‌ల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పర్యవేక్షణ వ్యవస్థను పరిశీలించి కలెక్టర్ బాలాజీ సంతృప్తి వ్యక్తం చేశారు. 45వ డివిజన్ సబ్‌జైల్ వెనుకభాగంలో వర్షాకాలంలో డ్రెయిన్ ముంపునకు గురవుతున్న నేపథ్యంలో డ్రెయిన్ అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలని మునిసిపల్ అధికారులకు కలెక్టర్ సూచించారు.



## రైతులు సూచనలు సలహాలు పాటించాలి

**ఏ.కొండూరు, మేజర్ న్యూస్:** రైతులు వ్యవసాయ శాఖ అధికారులు ఇచ్చే సూచనలు సలహాలు పాటించాలని వ్యవసాయ శాఖ అధికారి టిప్పు సుల్తాన్ అన్నారు. ఏ కొండూరు తండాలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ మొక్కజొన్న పంటలో ముఖ్యంగా టర్సికం ఆకు ఎండు తెగులు, వడలు తెగులు, కాండం కుళు తెగులు ప్రధాన సమస్య గా ఉన్నాయన్నారు. ఇందులో ఆకు ఎండు తెగులు వలన మొక్కల ఆకులపై కోలాకారపు బూడిద రంగుతో కూడిన ఆకుపచ్చ లేదా గోధుమరంగుతో చిన్న చిన్న మచ్చలు ఏర్పడి ఆకుల కింది భాగంలో కనిపించి తర్వాత పై ఆకులకు వ్యాప్తి చెందుతాయి అన్నారు. తెగులు తీవ్రతతో మచ్చల పరిమాణం పెరిగి దీర్ఘ చతురస్రాకారంగా మారుతాయి అన్నారు. అయితే వాతావరణంలో తేమ, ఉష్ణోగ్రత అధికంగా ఉన్నప్పుడు ఇది త్వరగా వృద్ధి చెందుతుందని దీని నివారణకు పంట మార్పిడి పాటించాలని సూచించారు. అలాగే మాంకోజెబ్ 2.5 గ్రాములు లీటర్ నీటికి కలిపి వారానికి ఒకటి లేదా రెండుసార్లు పిచ్చికారి చేసుకోవాలన్నారు. కాండం కుళ్ళు తెగులు మొక్కజొన్న కోత సమయంలో స్పష్టంగా కనిపిస్తుందని తెగులు సోకిన కణుపుల మధ్య భాగాలు కుళ్ళి మొక్కలు నల్లగా మారిపోతాయని పూత దశ తర్వాత నేలలో తేమశాతం తగ్గటం, వాతావరణంలో ఉష్ణోగ్రత పెరగడం వల్ల ఈ తెగులు తీవ్రంగా వ్యాపిస్తుందని తెలిపారు. నేలలో శిలీంద్రం మొక్కల వేర్ల ద్వారా కాండంపై భాగానికి వ్యాపిస్తుందని కాండం పై గోధుమ రంగు చారలు ఏర్పడతాయన్నారు. ఇటువంటి మొక్కలను చీల్చి చూసినప్పుడు బెండు భాగం కుళ్ళి నలుపు రంగుకు మారుతుందని దీని నివారణకు ట్రైకోడెర్మా శిలీంద్రం పశువుల ఎరువుతో వృద్ధి చేసి 3-4 సంవత్సరాలు పాటు వరుసగా నేలలో కలపాలన్నారు. ముఖ్యంగా పూత దశ తర్వాత నేలలో తేమ తగకుండా ఉండేవిధంగా నీటి తడులు ఇస్తూ ఉండాలని అలాగే 1 మి.లీ. ప్రొపికొనజోల్ లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్కే సిబ్బంది జి సౌమ్య రైతులు పాల్గొన్నారు.

## శ్రీ భద్రావతి సమేత భావనాఋషి స్వామి వారి కళ్యాణ మహోత్సవము





**విజయవాడ, ఫిబ్రవరి 4, మేజర్ న్యూస్:** పద్మశాలీయ కులబాంధవులచే స్థానిక లబ్బీపేట శ్రీ పద్మశాలీయ కళ్యాణమండపంలో, భద్రావతి భావనాఋషి స్వామి వార్ల కళ్యాణ మహోత్సవం నిర్వహించినారు. ప్రతి సంవత్సరం మాఘమాస శుద్ధ రథసప్తమి పర్వ దినమున,పుష్కరాంశమునందు శ్రీ భద్రావతి సమేత భావనాఋషి స్వామి వారి కళ్యాణ మహోత్సవము నిర్వహిస్తూ ఉంటారు. కమిటి సభ్యుల దంపతులతో కళ్యాణం లో పాల్గొన్నారు వారు గోలి భాస్కరరావు దంపతులు, కొల్లి సాంబశివరావు దంపతులు, డి. మురళీకృష్ణ, దామర్ల శాంతి దంపతులు, అవ్వరు బుల్లబ్బాయి దంపతులు ఆనవాయితీగా 9మంది దంపతులిచే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా పంచు మర్తి అనురాధ ఎమ్.యల్. సి, సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు టి.డి.పి, బిజెపి జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్,గద్దె క్రాంతికుమార్ టిడిపి, పి.శ్రీధర్,శ్రీ నందం అబద్దయ్య పద్మశాలియా కార్పొరేషన్ చైర్మన్, చిల్లపల్లి శ్రీనివాసరావు జనసేన నాయకులు, ఈ కళ్యాణ మహోత్సవమునకు మన పద్మశాలీ కుల బాంధవులు తో పాటు పద్మశాలీ సేవాసంఘము, యువజన సేవా సంఘం, మహిళా మండలి అధ్యక్షులు, కార్యదర్శులు, ఉపాధ్యక్షులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణలంక పోలీస్ స్టేషన్ వద్ద బారిగేట్లు తొలగింపు

**కృష్ణలంక సీఐ నాగరాజును కలిసిన గద్దె క్రాంతి**





**కృష్ణలంక, మేజర్ న్యూస్ :** కృష్ణలంక పోలీస్ స్టేషన్ హైవే వద్ద ఏర్పాటుచేసిన భారీ గేట్లతో ఇబ్బంది పడుతున్నామని స్థానిక ప్రజలు రైతు బజారు షాపులు వారు ఎమ్మెల్యే గద్దె రామమోహన్‌కు ఫోన్లో తెలియజేయడం ద్వారా తెలియ జేయడంతో హైదరాబాదులో ఉన్నందున ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మంగళ వారం ఉదయం తన కుమారుడు గద్దె క్రాంతికుమార్ పంపించి అక్కడ పరిస్థితులు పరిశీలించమని కోరారు. ఈ సందర్భంలో కృష్ణలంక పోలీస్ స్టేషన్లలో సీఐ నాగరాజుని గద్దె క్రాంతి కుమార్ కలిసి పగటి సమయంలో ప్రజలకు రాకపోకలకు ఇబ్బంది లేకుండా భారీ గేట్లు తొలగించాలని కోరారు. ఈ సందర్భంగా గద్దె క్రాంతి కుమార్ మాట్లాడుతూ కృష్ణలంక పోలీస్ స్టేషన్ ఎదురుగా హైవే భారీ గేటులతో మూసేయడం వల్ల బస్టాండ్‌కు వచ్చే ఆటో కార్మికులు, అలాగే కృష్ణలంక రైతు బజార్‌కి వచ్చే 21, 22 డివిజన్ ప్రాంతంలో నివసించే వారికి, రైతుబజార్ లో కూరగాయలు విక్రయించే రైతు బజార్ షాపుల వారికీ ఇబ్బందికరంగా ఉందని సిఐ నాగరాజుకు తెలియ జేయడం జరిగిందన్నారు.

దానిపై సి.ఐ నాగరాజు సానుకూలంగా స్పందించి ఉదయం 5 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు భారీ గేట్లు తొలగిస్తామని చెప్పి గేట్లను తొలగించారు. కృష్ణలంక పోలీస్ స్టేషన్ కు చేరుకున్న స్థానిక ప్రజలు, రైతు బజార్ షాపులు వారు గద్దె క్రాంతి కుమార్, సిఐ నాగరాజులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గొరిపర్తి నామేశ్వరరావు, పలిశెట్టి అన్నారావు, వేములపల్లి రంగారావు, పెద్ది అన్నారావు, తోట శ్రీనివాస్, టెంటు రాజేష్, కొండేటి వెంకట్రావు, నడికొప్పుల రవి తదితరులు పాల్గొన్నారు.

# వసతి గృహానికి సీసీ కెమెరాలు



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** అవనిగడ్డలోని కళాశాల బీసీ బాలికల వసతి గృహానికి ప్రముఖ వితరణశీలి, విశ్రాంత బ్యాంకు ఉద్యోగి అద్దంకి సుబ్బారావు( బ్యాంకు సుబ్బారావు) మంగళవారం సీసీ కెమెరాలు, ఇన్వర్టర్, పుస్తకాలు వితరణ చేసారు. మంగళవారం ఉదయం వసతి గృహంలో బీసీ బాలుర వసతిగృహ సంక్షేమ అధికారి సురేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్ర మంలో అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఎ. దివ్య చేతులమీదుగా సీసీ కెమెరా లు, ఇన్వర్టర్ లను లాంఛనంగా ప్రారంభించి అనంతరం విద్యార్థినులకు ఉపయోగపడేలా పెద్ద బాలశిక్ష, డిక్షనరీలను అందచేసారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న డిగ్రీ కళాశాల రిటైర్డు ప్రిన్సిపల్ బోగాది సుబ్రహ్మ ణ్యేశ్వరరావు మాట్లాడుతూ దాత బ్యాంకు సుబ్బారావు చేసిన వితరణ పది మందికి ఆదర్శమని అన్నారు.. కళాశాల బాలికల వసతి గృహ రక్షణ కోసం సీసీ కెమెరాలు, విద్యుత్ అంతరాయం కలిగిన సందర్భంలో వారి చదువుకు ఆటంకం కలుగకుండా ఉండేలా ఇన్వర్టర్, వారిలో ఉన్నత విలువలు పెంపొం దేలా పెద్ద బాలశిక్ష, డిక్షనరీలు అందించిన బ్యాంకు సుబ్బారావుకు అభినం దనలు తెలిపారు.. ఈ కార్యక్రమంలో ఎస్వీఎల్ కళాశాలల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు, విద్యావేత్తలు కునపరెడ్డి చంద్రశేఖర్, జీఓ నాగభూషణరావు, వసతి గృహ సంక్షేమ అధికారిణి టీ నాగమణి తదితరులు పాల్గొనగా దాత సుబ్బారావును అవనిగడ్డ డివిజన్ బీసీ వెల్ఫేర్ శాఖ తరుపున ఘనంగా సత్కరించారు.

# సూర్య భగవానుని ఆశీస్సులతో సుభిక్షంగా ఉండాలి

**ఎమ్మెల్యే వెనిగండ్ల రాము**

**భీమేశ్వరస్వామి వారి దేవస్థానంలో**

**రథసప్తమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే**

**పూజా కార్యక్రమాలు నిర్వహించి, చండీ హోమంలో**

**పూర్ణాహుతిని సమర్పణ**



**గుడివాడ, మేజర్ న్యూస్:** సూర్య భగవానుని ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షం గా ఉండాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. బంటుమిల్లి రోడ్డులోని శ్రీ భీమేశ్వర స్వామి వారి దేవస్థానంలో మంగళవారం రథసప్తమి వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ప్రజల కళ్యాణ సౌభాగ్యాల కోసం, రాష్ట్రం సస్యశ్యామలంగా అభివృద్ధి చెందటం కోసం మహా చండీ హోమ పూజలు నిర్వహించారు. శ్రీ సూర్య భగవానుని ఆశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. వేడుకల్లో ఏపీ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్ర



మాలు నిర్వహించారు. నియోజకవర్గ ప్రజల అభివృద్ధిని కాంక్షిస్తూ ప్రవాసాంధ్రుడు భక్తుడు యేలిసెట్టి జగన్ సహకారంతో దేవస్థానం ప్రాంగణం లో విశేష హోమ పూజలు నిర్వహించారు. పూజా పీఠాలపై ఎమ్మెల్యే రాము కుటుంబ సభ్యులు చేకూరు జగన్మోహన్రావు – రజనీ దంపతులు, పలువురు భక్తులు కూర్చుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజలు ముగిసిన అనంతరం ఎమ్మెల్యే వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య హోమగుండంలో పూర్ణాహుతినీ సమర్పించారు. ఈ వేడుకల్లో గుడివాడ జనసేన ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్, బిజెపి కన్వీనర్ దావులూరి సురేంద్రబాబు, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, పేద పండితులు భైరవభట్ల విజయకుమార్, రాజేశ్వర శాస్త్రి, తాసిల్దార్ రామకోటేశ్వరరావు, దేవస్థానం ఈవో కందుల గోపాలరావు, సీనియర్ టిడిపి నాయకులు పిన్నమనేని బాబ్జి, డాక్టర్ గోర్జి సత్యనారాయణ, లింగం ప్రసాద్, గుడివాడ పట్టణం టిడిపి అధ్యక్షులు దింట్యాల రాంబాబు, రూరల్ మండల అధ్యక్షుడు వాసే మురళి, జనసేన పార్టీ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాస్, ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ గోకవరపు సునీల్, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ మజ్జాడి నాగరాజు, శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి దేవస్థాన కమిటీ చైర్మన్ సాయన రాజేష్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## క్యాన్సర్ బాధితుడికి గద్దె కాంతి ఆర్థిక సహాయం

**విజయవాడ, మేజర్ న్యూస్ :** మాచవరం 2వ డివిజన్ కు చెందిన పులి శేషుబాబు క్యాన్సర్ వ్యాధితో ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో వారి వైద్య ఖర్చుల నిమిత్తం ఆయన సతీమణి పులి ఉమా సరస్వతికి మంగళవారం ఉదయం గద్దెక్రాంత్ కుమార్ మాచవరం టౌన్ కి వెళ్లి గద్దె ఫౌండేషన్ ద్వారా 25 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్ర మంలో దాసరి గాబ్రియేలు, సుగసాని కృష్ణ ప్రసాద్, ముత్యాల కృష్ణ, ఈదా కొండా, కుంచాల కోటేశ్వరరావు, నాళం నరేంద్ర తదితరులు పాల్గొన్నారు

## బస్ డ్రైవర్‌లు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

**కృష్ణా జిల్లా ఆర్‌టీసీ డీపీటిఓ ఎ.వాణిశ్రీ**



**గన్నవరం, ఫిబ్రవరి 4, మేజర్ న్యూస్ :** గన్నవరం డిపోలో జరుగుచున్న రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో మంగళ వారం కృష్ణా జిల్లా ఆర్టీసీ డీపీటిఓ ఎ. వాణిశ్రీ పాల్గొన్నారు. ఆర్టీసీ అంటే భద్రతకు నమ్మకం అని బస్ డ్రైవర్‌లు భద్రతా నియమాలు పాటిస్తూ ఎటువంటి ప్రమాదాలు జరగ కుండా బస్‌లు నడపాలని తెలిపినారు. ట్రాఫిక్ సిగ్నల్స్, ట్రాఫిక్ నియమాలు పాటించాలి, సెల్ ఫోన్ డ్రైవింగ్ చేయరాదని, పూర్తి ఏకాగ్రతతో బస్ నడపాలని, మంచి ఆహారపు అలవాట్లుతో ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని, ప్రయాణికుల తో మర్యాదగా ప్రవర్తించాలని, గ్యారేజ్ సిబ్బంది మంచి కండిషన్‌లో ఉన్న బస్సులు డ్రైవర్లకు అందించాలని, బస్‌లకు వచ్చిన రిపేర్లు ఎప్పటికప్పుడు పూర్తిగా చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని, ఎ పిఎస్ ఆర్టిసికి ప్రజ లలో ఉన్న మంచి పేరు నిలబెట్టాలని తెలిపారు. ఈ కార్యక్ర మంలో గన్నవ రం డిపో మేనేజర్ పి.శివాజీ, సూపర్వైజర్‌లు మధు, వెంకటే శ్వరరావు, డ్రైవర్లు, కండక్టర్లు, ఆఫీసు సిబ్బంది, గ్యారేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

## వేగం తగ్గించండి - ప్రాణాలు కాపాడండి!




**నందిగామ, ఫిబ్రవరి 4, మేజర్ న్యూస్:** జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా మంగళవారం నాడు ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయము, నందిగామలో స్కూల్ బస్ డ్రైవరు ల కు అవగాహన సదస్సు నిర్వహించినట్లు ఆర్టీవో యం.పద్మావతి తెలిపారు. ఈ సందర్భంగా ఆర్టీవో యం.పద్మావతి మాట్లాడుతూ స్కూల్ బస్ లు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో భాద్యతగా వ్యవహవరించాలని, బస్‌లో ఫస్ట్ అయిడ్ బాక్స్ తప్పనిసరిగా ఉండవలెను అని, డ్రైవరు అటెండర్ యూనిఫామ్ లో ఉండవలెను అని, అత్యవసర ద్వారము ఉండేటట్టుగా చూసుకొనవలెను అని తెలిపారు. తదుపరి మోటార్ వాహన తనిఖీ అధికారి యం. పూర్ణిమ మాట్లా డుతూ స్కూల్ బస్ లో ఎటువంటి పరిస్థితి లో కూడా పరిమితిని మించి విద్యార్థులను ఎక్కించరాదని, డ్రైవరు కు 5 సం డ్రైవింగ్ లో అనుభవము ఉండవలెను అని, బస్‌లో విద్యార్థుల వివరములు తప్పనిసరిగా నమోదు చేయవలెను అని సూచించారు.ఈ కార్యక్రమంలో నందిగామ ప్రాంతీయ రవాణా శాఖాధికారి యం.పద్మావతి, మోటార్ వాహన తనిఖీ అధికారి యం.పూర్ణిమ, పరిపాలన అధికారి బి ఎస్ కే ప్రభాకర లింగం, నారాయణ టెక్నో స్కూల్ డ్రైవరులు, కాకతీయ అపోలో స్కూల్ డ్రైవరులు, శ్రీవిద్య స్కూ ల్ డ్రైవరులు, చైతన్య స్కూల్ డ్రైవరులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## కల్లు గీత కార్మికుల విచ్ఛిన్నాన్ని ఎదుర్కోవాలి

### అఖిల భారత గౌడ సంఘం ఛైర్మన్ పేరం శివ నాగేశ్వరరావు



**విజయవాడ మేజర్ న్యూస్ :** రాష్ట్రం లో జరుగుతున్న కల్లు గీత కార్మికుల విచ్ఛిన్నాన్ని ఎదుర్కోవాలని అఖిల భారత గౌడ సంఘం ఛైర్మన్ పేరం శివ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. గౌడ, శెట్టి బలిజ, ఈడిగ, శ్రీ సైన, యాత, కలాల్, కలారి తదితర కల్లు గీత కార్మిక కుటుంబాలను డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న సూచనల మేరకు 1998 సంవత్సరం లో నాటి ప్రభుత్వం జీవో నెంబర్ 16 ప్రకారం అందరూ సమానమని గౌడ కులంగా నామకరణం చేశారని గుర్తు చేశారు. నాటి నుంచి ఐక్యంగా ఉన్న గౌడ జాతిని బ్రాందీ షాపుల్లో వాటా అడిగినందుకు తెలుగుదేశం ప్రభుత్వం కుట్రపూరితంగా 10 కులాల పేర్లతో విచ్ఛిన్నం చేయడానికి కుట్ర పూనుకుందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం గౌడ్ లకు 20శాతం మద్యం దుకాణాల్లో వాటా ఇస్తామని చెప్పి నేడు 10శాతం ఇస్తూ మోసం చేసిందన్నారు. కల్లు గీత కార్మిక కుటుంబం లో జన్మించిన ఏ వ్యక్తి అయినా రాష్ట్రంలో ఎక్కడైనా మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేసుకునే విధంగా ప్రభుత్వం అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. గౌతు లచ్చన్న ఆశయ సాధన దిశగా కల్లు గీత కార్మికులను గౌడ కులంగా నే కొనసాగించాలనే డిమాండ్ తో అందరూ ఐక్య పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. అందుకు త్వరలోనే కార్యాచరణ ప్రణాళిక ప్రకటిస్తామని తెలిపారు.

## ఈనెల 14న 'తల' చిత్రాన్ని ఆదరించండి




**విజయవాడ మేజర్ న్యూస్ :** తాను దర్శ కత్వం వహించిన తల చిత్రం తెలుగు, తమిళ ఇండస్ట్రీలో సంచలనాలు సృష్టిం చనుందని దర్శకుడు అమ్మ రాజశేఖర్ తెలిపారు. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఈనెల 14వ తేదీన ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నామని ప్రేక్షకులు తమ చిత్రాన్ని వీక్షించి ఆదరించాలని ఆయన కోరారు. బందర్ రోడ్డు లోని ఒక హోటల్లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దర్శకుడు, కొరియో గ్రాఫర్ అమ్మ రాజశేఖర్ మాట్లాడుతూ తన కుమారుడు రాగిన్ రాజ్ ను హీరోగా పరిచయం చేస్తూ తల అనే చిత్రాన్ని నిర్మించడం జరిగిందన్నారు. ఈ చిత్రం కోసం రెండేళ్ల పాటు కుటుంబమంతా కష్టపడినట్లు తెలిపారు. ఈ చిత్రం ద్వారా తెలుగు, తమిళ ఇండస్ట్రీలో అమ్మ రాజశేఖర్ కచ్చితంగా కం బ్యాక్ ఇస్తారని ఆయన ప్రేక్షకులకు తెలియజేశారు. ఈ చిత్రంలో యాక్షన్ సన్నివేశాలు అద్భుతంగా ఉన్నాయని, హీరో హీరోయిన్స్ మధ్య వచ్చే ప్రేమ రొమాంటిక్ సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయని చెప్పారు. ప్రముఖ సంగీత దర్శకుడు తమన్ ఈ చిత్రానికి సంగీత దర్శకుడుగా కూడా పని చేశారని వివరించారు. పూర్తిస్థాయి మాస్ అండ్ యాక్షన్ చిత్రాన్ని తెలుగు తమిళ ప్రేక్షకులు వీక్షించి ఆదరించాలని ఆయన కోరారు. ప్రేమికుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 14వ తేదీన లవ్ అండ్ యాక్షన్ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు ఆయన తెలియజేశారు. ఇప్పటికే విడుదలైన టీజర్ ట్రైలర్ కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించడం సంతోషంగా ఉందన్నారు. విజయవాడ నగరం నుంచి తమ చిత్ర ప్రమోషన్ ప్రారంభించడం ఆనందంగా ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో హీరో రాగిన్ రాజ్, హీరోయిన్ నోరా ఎస్తేర్, ఎగ్జిక్యూటివ్ నిర్మాత రాధ రాజశేఖర్ పాల్గొన్నారు.

## ముద్రగడ పద్మనాభం ఇంటిపై దాడిని తీవ్రంగా ఖండించిన యువనేత గౌతమ్

అవనిగడ్డ, మేజర్ న్యూస్ : మాజీ మంత్రి మాజీ ఎంపీ వైసీపీ నేత ముద్రగడ పద్మనాభ రెడ్డి నివాసం పై ఈనెల 2వ తేదీ సోమవారం జరిగిన దాడిని యువనేత బడే గౌతమ్ మంగళవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలంలోని గజపతినగరానికి చెందిన గనిశెట్టి గంగాధర్ తెల్లవారుజామున 4 గంటల సమయంలో ట్రాక్టర్ తో ముద్రగడ ఇంటి ఆవరణలోకి వచ్చి గేటు, కారు, ఫ్లెక్సీలు, పూలకుండీలను ఢీకొట్టి పరారయ్యాడు. వెంటనే స్పందించిన ముద్రగడ్డ అనుచరులు గంగాధర్ను పట్టుకొని దేహశుద్ధి చేశారు విషయం తెలుసుకున్న పోలీసులు గంగాధర్ ను అదుపులోకి తీసుకున్నారుప్రతినిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే వ్యక్తి, ప్రజల మనిషి, పోరాట యోధుడు, ఎన్నో సేవా కార్యక్రమాలు చేసిన ముద్రగడ్డ ఇంటిపై దాడి జరగటం చాలా బాధాకరమని, ఇలాంటి కక్ష పూరిత చర్యలు తగవని యువనేత గౌతమ్ తీవ్రంగా ఖండిస్తూ ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# మే 10న కొమెడ్-కె, యుని-గేజ్ ప్రవేశ పరీక్ష

### మార్చి 15 వరకు దరఖాస్తుకు అవకాశం



**విజయవాడ మేజర్ న్యూస్ :** కర్ణాటకలోని 150కి పైగా ప్రముఖ ఇంజినీరింగ్ కాలేజీలతోపాటు దేశవ్యాప్తంగా ఉన్న 50కి పైగా ప్రైవేట్, అటానమస్, డీమ్డ్ యూనివర్సిటీల్లో బీ.ఈ., బీ.టెక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం కామన్ ఎంట్రన్స్ టెస్ట్ కొమెడ్-కె, యుని-గేజ్- 2025 ప్రవేశ పరీక్షను మే 10వ తేదీన నిర్వహించనున్నట్లు కొమెడ్-కె. ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ డాక్టర్ కె.కుమార్ వెల్లడించారు. విజయవాడలోని ఓ హోటల్లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిష్టాత్మక ఈ ప్రవేశ పరీక్ష షెడ్యూల్ను వెల్లడించారు. గత ఐదు దశాబ్దాలుగా ఉన్నత విద్యలో కర్ణాటక తన అగ్రస్థానాన్ని కొనసాగిస్తోందని తెలిపారు. తాము నిర్వహించే కొమెడ్-కె, యుని-గేజ్ ఏకీకృత పరీక్ష ద్వారా కర్ణాటకలోని ప్రఖ్యాత ప్రైవేట్ ఇంజినీరింగ్, మెడికల్ కాలేజీలతోపాటు దేశవ్యాప్తంగా ఉన్న 50కి పైగా యుని-గేజ్ సభ్య ప్రైవేట్, అటానమస్, డీమ్డ్ యూనివర్సిటీల్లో అడ్మిషన్లు ఇస్తారని వివరించారు. ఈ ఏడాది అడ్మిషన్ల కోసం మే 10వ తేదీన దేశవ్యాప్తంగా 400 కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు. ఈ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు మార్చి 15వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో అభ్యాసన నైపుణ్యాలు, ఉద్యోగ నైపుణ్యాలను పెంపొందించి వర్క్‌ఫోర్స్‌గా తీర్చిదిద్దేందుకు 10 ఇన్నోవేషన్ హబ్‌లను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సోమవారం నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైందని ఆసక్తిగల విద్యార్థులు www.comedk.org, www.unigauge.com అనే వెబ్‌సైట్‌ల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలు ఈ వెబ్‌సైట్‌లలో లభిస్తాయని చెప్పారు. ఈఆర్ఏ ఫౌండేషన్ సీఈవో పి.మురళీధర్ మాట్లాడుతూ భారతదేశ భవిష్యత్ శ్రామికశక్తి సమగ్ర అభివృద్ధికి దోహదపడే వేదికగా యుని-గేజ్ పని చేస్తుందని తెలిపారు. ఈ ఏడాది కొమెడ్-కె, యుని-గేజ్ పరీక్షకు దేశవ్యాప్తంగా 1.2లక్షల మందికి పైగా హాజరవుతారని అంచనా వేస్తున్నామని చెప్పారు.

# 6వ తేదీన హలో బీసీ చలో ఢిల్లీ కార్యక్రమం

### బీసీలకు 50 శాతం రిజర్వేషన్ లు సాధనే లక్ష్యంగా సమావేశం

### బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బోను దుర్గ నరేష్



**విజయవాడ మేజర్ న్యూస్ :** 26 రాష్ట్రాలకు చెందిన బిసి ఎంపీలతో ఢిల్లీలోని ఏపీ భవన్‌లో బీసీల సమస్యల పరిష్కారం కోరుతూ రౌండ్ టేబుల్ సమావేశం జరగనున్నట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బోను దుర్గా నరేష్ తెలిపారు.. బీసీలకు 50% రిజర్వేషన్లతో పాటు ప్రధాన సమస్యలపై ఈ సమావేశంలో తీర్మానం చేసి ప్రధాని మోడీ దృష్టికి తీసుకువెళ్ళనున్నట్లు చెప్పారు.. రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో తమ పోరాటం ఉంటుందని తెలియజేశారు. గాంధీనగర్ లోని ప్రెస్ క్లబ్ లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బోను దుర్గా నరేష్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 6వ తేదీన హలో బిసి చలో ఢిల్లీ పేరుతో కార్యక్రమం తలపెట్టినట్లు చెప్పారు.. ఢిల్లీలోని ఏపి భవన్ లో బీసీల సమస్యలపై ఈ రౌండ్ టేబుల్ సమావేశం జరగనున్నట్లు చెప్పారు...తొలిసారి ఎంపీల మద్దతుతో బీసీల సమస్యల పరిష్కారం కోసం ముందుకు వెళుతున్నట్లు తెలిపారు..ఈ సమావేశంలో 26 రాష్ట్రాలకు చెందిన బీసీ ఎంపీలు, కేంద్ర మంత్రులు పాల్గొంటారు అన్నారు... ఆంధ్రప్రదేశ్ నుంచి ఐదు వందల మంది బీసీ నేతలు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.. బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు,, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు,, బిసి కులగణన లాంటి అంశాలు లక్ష్యంగా ఈ రౌండ్ టేబుల్ సమావేశం జరుగుతుందని చెప్పారు.. ఈ సమావేశంలో తీర్మానించిన అంశాలను ప్రధాని మోడీ దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరించే దిశగా పోరాటం ఉంటుందని అన్నారు.. బీసీల సమస్యలను పరిష్కరించడానికి ప్రధాని మోడీ సిద్ధంగా ఉన్నారని చెప్పారు.. గత ఐదు దశాబ్దాలుగా బీసీల కోసం పోరాడుతున్న రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు..ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు రంగు విక్రమ్,, పెంట సాయికిరణ్, మెండెం జ్యోతి,, పోతిన వరప్రకాష్,,జవ్వాది సుధీర్, హేమ,వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## కెఎల్‌రావు పార్క్‌లో యాంఫి థియేటర్ ఏర్పాటు చేయండి





**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** ప్రజలు ఆహ్లాదంగా సమయాన్ని గడిపే కేఎల్ రావు పార్క్ లో మరింత అహ్లాద భరితంగా చేసేందుకు యాంఫి థియేటర్‌ను ఏర్పాటు చేయాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. మంగళవారం ఉదయం తన పర్యటనలో భాగంగా చిట్టినగర్ వద్ద గల కేఎల్ రావు పార్క్, సూరిరావుపేట, వన్ టౌన్ ప్రాంతాలని పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కేఎల్ రావు పార్క్ లో యాంఫి థియేటర్ను ఏర్పాటు చేసి ప్రజలకు మరింత అహ్లాదాన్ని అందించాలని, పార్క్ లోపల ఉన్న మరమ్మతులను సత్వరమే పూర్తి చేసి, పార్కు విచ్చేసిన ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని, నిత్యం రద్దీగా ఉండే ఈ పార్క్ లో ప్రజల సౌకర్యార్థం వాహనాలు నిలిపేందుకు ఒక ప్రత్యేకమైన ప్రాంతానికి కేటాయించాలని అధికారులను ఆదేశించారు. వరదల్లో పాడైపోయిన ఇండోర్ స్టేడియం ను, పునరుద్ధరిస్తున్న పనులను పరిశీలించారు. ఇండోర్ స్టేడియంలో గల ఫ్లోరింగ్ నాణ్యత ప్రమాణాలతో పూర్తిచేసి త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. పార్క్ లో జరుగుతున్న లైటింగ్ పనులను పరిశీలించి, మరమ్మతులు వేగవంతం చేయాలన్నారు. కే ఎల్ రావు పార్కు ముఖద్వారమును మరింత అందంగా అభివృద్ధి పరచుటకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బందర్ రోడ్డు, సూర్యారావుపేట ప్రాంతాల్లో అన్ని పర్యటించి పారిశుధ్య నిర్వహణను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గాంధీజి మహిళా కళాశాల వద్ద గల అన్న క్యాంటీన్ ను పరిశీలించారు. నిర్ణీత టోకెన్ నెంబర్లు ఇస్తున్నారా, ఆహార నాణ్యత, కిచెన్ పరిశుభ్రత, అన్న క్యాంటీన్లో గల త్రాగునీరు, పారిశుద్ధ్యం, మరుగుదొడ్ల నిర్వహణ వంటి విషయాలన్నీ క్షేత్రస్థాయిలో పరిశీలించి నోడల్ ఆఫీసర్లు అందరూ ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ ప్రజలు ఎటువంటి ఇబ్బంది కలకుండా చూసుకోవాలని అన్నారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ జి వి జి ఎస్ వి ప్రసాద్, ఇన్చార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, సూపరిండెంటింగ్ ఇంజనీర్లు పి.సత్యనారాయణ, పి సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటేశ్వర్ రెడ్డి, ఇన్చార్జ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (పార్క్స్) శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




## టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి



**గుడివాడ, మేజర్ న్యూస్:** మార్కెట్ సెంటర్‌లో సైకిల్ పై వెళుతున్న వ్యక్తిని టిప్పర్ ఢీకొనడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్ ని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ప్రమాదంలో మృతి చెందిన సైక్లిస్టు భౌతికకాయాన్ని గుడివాడ ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ కు తరలించి గుడివాడ వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతిని వివరాలు తెలియాల్సి ఉంది.

# సినాప్స ఒలింపియాడ్ పోటీ పరీక్షలలో ర్యాంకులు సాధించిన నారాయణ విద్యార్థులు



ఐఎస్ఎంఓ (ఈ చాంప్స్ విద్యార్థులు)



ఐఎస్ఈవో హైస్కూల్ విద్యార్థులు

**విజయవాడ, మేజర్ న్యూస్ :** సినాప్స ఒలింపియాడ్ పోటీ పరీక్షలలో హై స్కూల్ రోడ్ లోని పటమట నారాయణ ఈ.ఎం. స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంక్ లు సాధించారు. ఆల్ ఇండియా లెవెల్ లో జరిగిన ఈ పోటీలకు నారాయణ ఈ చాంప్స్, హైస్కూల్ నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొనడమే కాకుండా అత్యుత్తమ ర్యాంకులు సాధించడం పట్ల స్కూల్ ఏజీఎం మురళీ కిషోర్, క్లస్టర్ ప్రిన్సిపాల్ రాజశేఖర్, ఈ చాంప్స్ కార్డినేటర్ జహూర్ ఫాతిమాఖాన్, ఉన్నత పాఠశాల కార్డినేటర్ ముత్తారెడ్డి, ప్రిన్సిపాల్ శామ్యూల్ రాజు తదితర ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

**ర్యాంకులు సాధించిన విద్యార్థులు :** ఐఎస్ఎంఓ (ఈ చాంప్స్ విద్యార్థులు) షేక్ మునాఫ్ ఖాజా, వై మహిత్, నేలపాటి సంధ్య, కిలారు రుద్ర శశికుమార్

– ఐఎస్ఈవో (హైస్కూల్ విద్యార్థులు) గొణితిన కుసుమ, పొట్నూరు జ్యోష్ణ, మోకా దుర్గా మహేశ్, సంగెపు ప్రద్యుత్ భార్గవ్, మాగంటి దేదీప్య, నాయుడు హర్షిణి, ఎస్ సాయి దశ్య, మధురేష్ కుమార్, పలతులసి డి మాన్వి, ఎం జోషిత సాయి శ్రీ



## బ్యాంకు సుబ్బారావు సేవా నిరతి అభినందనీయం

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** బీసీ వసతి గృహానికి కావలిసిన మౌలిక సదుపాయాల కల్పనకు ముందుకు వచ్చిన బ్యాంకు సుబ్బారావు సేవా నిరతి అభినందనీయం అని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం బ్యాంకు సుబ్బారావు ఆర్థిక సౌజన్యంతో విద్యార్థినులకు ఆక్స్ ఫర్డ్ డిక్షనరీ లు, పెద్ద బాలశిక్ష పుస్తకాలను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అందచేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కళాశాలలో చదువుతున్న బాలికల బీసీ వసతి గృహంలో విద్యార్థినులకు రక్షణ కల్పించేలా సీసీ కెమెరాలు, విద్యుత్ అంతరాయం కారణంగా వారి చదువుకు ఆటంకం కలుగకుండా ఇన్వర్టర్ అందజేశారన్నారు. ఈ సందర్భంగా సుబ్బారావును మండలి దుశ్శాలువాతో సత్కరించారు. ప్రభుత్వాలు చేయలేని కొన్ని పనులు దాతల సహకారంతో పూర్తవుతున్నాయని, సుబ్బారావు లాంటి దాతలు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని బుద్ధప్రసాద్ సూచించారు.. ఈ కార్యక్రమంలో ఎస్వీఎల్ కళాశాలల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వర రావు, విద్యావేత్తలు కునపరెడ్డి చంద్రశేఖర్, జీఓ నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా రథసప్తమి వేడుకలు





**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** మాఘశుద్ధ సప్తమి మంగళవారం రథసప్తమి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు .మండల పరిధిలోని వేకనూరు లో వేంచేసి ఉన్న ఉషా పద్మినీ సమేత సూర్యనారాయణ స్వామి వారి ఆలయ 15వ వార్షికోత్సవం, రథసప్తమి మహోత్సవాన్ని (సూర్య జయంతి) భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్వామివారికి అభిషేకం నిర్వహించి, నిజరూప దర్శనం ఇచ్చారు. అనంతరం సూర్య నమస్కారాలు అలంకారాలు, సహస్రనామ పూజ నిర్వహించారు.అత్యంత భక్తి శద్ధలతోస్వామివారి శాంతి కళ్యాణం జరిపించారు ఆలయ ప్రధాన అర్చకులు దివి నరసింహమూర్తి స్వామివారికి 108 లీటర్ల ఆవు పాలతో అభిషేకించి విశేష పూజలు అర్చనలు అష్టోత్తరనామార్చనలతో పూజలు నిర్వహించారు. ఆలయ సిద్ధాంతి పాకలపాటి రామచంద్రరావు పర్యవేక్షణలో పండితులు ఆనంద్ బాబు, పలువురు వేద పండితులు వేదమంత్రోచ్ఛారణ నడుమ నిర్వహించిన శాంతి కల్యాణంలో పాల్గొని తిలకించేందుకు పరిసర గ్రామాలతోపాటు గుంటూరు, ఎన్టీఆర్ జలాల నుండి సైతం వేకనూరులోని సూర్య భగవానుని దర్శించుకునేందుకు వేలాదిగా తరలివచ్చారు. శాంతి కల్యాణం తిలకించి తీర్థ ప్రసాదములు స్వీకరించారు ఆలయ ధర్మకర్త తుంగల వసంతరావు ఇందిరా దంపతులు భక్తుల సహకారంతో 15 వేలమంది భక్తులకు అన్న ప్రసాదము అందజేయగా భక్తులకు కావలసిన ఏర్పాట్లను స్వయంగా పరివేక్షించారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే



**పామర్రు ఫిబ్రవరి 4 మేజర్ న్యూస్:** మచిలీపట్నం జిల్లా తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో జరిగిన గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఎన్నికల సమావేశంలో పామరు శాసనసభ్యుడు వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఈ సమావేశంలో మాట్లాడుతూ స్థానికంగా ఉండే ఓటర్లను ఎనిమిది నెలల పాలనలో చేస్తున్న అభివృద్ధిని వివరించి ఓట్లను అభ్యర్థించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే దూర ప్రాంతాల్లో ఉన్న వారికి ఫోన్ ద్వారా, ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం అందించి తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. ఆ విధంగా గ్రాడ్యుయేట్ ఓటర్లు అందరిని పోలింగ్ కేంద్రాలకు తీసుకురావడం ద్వారా అత్యధిక మెజార్టీతో గెలిచే అవకాశం కలుగుతుందన్నారు. ఈ సమావేశంలో మంత్రులు జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ళ నారాయణరావు, మంత్రి కొల్లు రవీంద్ర, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## అగ్రహారం బ్రిడ్జి ను పరిశీలించిన ఎమ్మెల్యే

**జగ్గయ్యపేట, మేజర్ న్యూస్:** పట్టణంలోని జగ్గయ్యపేట నుండి ముక్త్యాల వెళ్ళే రోడ్డును ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా వరద నీటిలో ఈ బ్రిడ్జి ఇబ్బందులకు గురైనదని, రానున్న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని వేల మంది ప్రజలు,భక్తులు ఈ బ్రిడ్జి పైనుంచి ముక్త్యాల ప్రయాణం చేస్తూ, కోటిలింగాల క్షేత్రాలకు వెళ్తారు. కనుక ఈ బ్రిడ్జ్ మరమ్మత్తులను పర్యవేక్షిస్తున్నామని కొంత మొత్తం వాణిజ్య సముదాయాల నుంచి సి.ఎస్.ఆర్ నిధులు కేటాయించాలని కోరామని, అలాగే కలెక్టర్ లక్ష్మీశా కి కూడా బ్రిడ్జ్ మరమ్మత్తులపై నిధులు మంజూరు చేయాలని కోరియున్నామని,ఇప్పటికే వినతి పత్రం అందజేశామని తెలియజేశారు. శివరాత్రి లోపు ప్రజలకు,భక్తులకు ఇబ్బంది కలగకుండా తాత్కాలిక మరమ్మత్తులు చేసి రవాణా సౌకర్యం పూర్తిస్థాయిలో కేటాయిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఎలమంచిలి రాఘవ, వార్డ్ కౌన్సిలర్స్ ఇర్రి నరసింహారావు, సంగెపు బుజ్జిబాబు, పేరం సైదేశ్వర రావు, గింజుపల్లి వెంకట్రావు, నకిరకంటి వెంకట్, గొట్టే నాగరాజు, నాయకులు మల్లెల కొండయ్య, దువ్వల రామకృష్ణ, గింజుపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## జడ్పీటీసీ సభ్యులు బాబుకి స్వదేశాగమన శుభాకాంక్షలు



**జగ్గయ్యపేట,ఫిబ్రవరి 4 మేజర్ న్యూస్ :** నియోజకవర్గంలో నందిగామ మండలం, గోళ్ళమూడి గ్రామంలో జడ్పిటిసి సభ్యులు గాదెల వెంకటేశ్వర్లు (బాబు) విదేశీ పర్యటన ముగించుకొని స్వగ్రామానికి విచ్చేసిన సందర్భంగా మంగళవారం వారి నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో నియోజకవర్గ ఇన్చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎంపీపీ సంఘాల అధ్యక్షులు మార్కపుడి గాంధీ, సర్పంచ్ కాటారపు కృష్ణా, ఉప సర్పంచ్ పాలేటి రాము, మండల కన్వీనర్ దేవినేని రామారావు, కావేటి నాగేశ్వరరావు, కన్నమాల శామ్యూల్, కార్యకర్తలు, తదితర స్థానిక నాయకులు పాల్గొన్నారు.



## దేవాలయంలో సుదర్శన నరసింహ యాగం

**జగ్గయ్యపేట,ఫిబ్రవరి 4, మేజర్ న్యూస్ :** పావన కృష్ణానది తీరమున పంచ నారసింహ క్షేత్రమైన వేదాద్రి గ్రామంలో వేంచేసియున్న శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానంలో మాఘమాసం రథసప్తమిని పురస్కరించుకొని దేవస్థాన కార్యనిర్వాహణాధికారి కానూరి సురేష్ బాబు ఆధ్వర్యంలో దేవస్థాన అర్చకులచే "సుదర్శన నరసింహ యాగం" నిర్వహించబడినదని ఆలయ వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త డాక్టర్ వి.యల్. ఇందిరాదత్తు వారి తరుపున కెసిపి సంస్థ నుండి పాటిబండ్ల రామ్ ప్రసాద్, భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదములు స్వీకరించడం జరిగిందని వారు తెలిపారు.

## వార్డులోని సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తాం

**జగ్గయ్యపేట,ఫిబ్రవరి 4, మేజర్ న్యూస్ :** పట్టణంలోని దుర్గాపురం వార్డ్ లో కూటమి నేతలతో కలిసి ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తాతయ్య స్థానికుల నుంచి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వార్డులోని ప్రధానంగా కరెంట్ లో వోల్టేజ్ కారణంగా ఇబ్బంది పడుతున్నామని అదేవిధంగా వీధులలో కరెంటు పోల్స్ ను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య సంబంధిత అధికారులతో మాట్లాడారు. వారి సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని వారికి హామీ ఇచ్చారు. అంతేకాకుండా వేసవికాలంలో నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే తాతయ్య అధికారులను ఫోన్ లో ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, పట్టణ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి మైనేని రాధాకృష్ణ, పట్టణ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు షేక్ ఖాసిం, వార్డు కౌన్సిలర్ వేదులాపురి అలేఖ్య సైదా కౌన్సిలర్స్ ఇర్రి నరసింహారావు, సంగెపు బుజ్జిబాబు, పేరం సైదేశ్వర రావు,గింజుపల్లి వెంకట్రావు, నకిరకంటి వెంకట్, పట్టణ తెలుగు యువత అధ్యక్షులు వేదులపూరి సైదా, మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ మల్లెల కొండయ్య, నాయకులు దువ్వల రామకృష్ణ, చిలుకూరి కార్తీక్, గుంజుపల్లి కృష్ణ, మోపిదేవి నాగబాబు, కొల్లు గోపి తదితరులు పాల్గొన్నారు.

## పులిగడ్డల ఉపాధి హామీ పనులు ప్రారంభం



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని పులిగడ్డ పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పనులను మంగళవారం సర్పంచ్ దాసరి విజయ్ కుమార్ ప్రారంభించారు పంచాయతీ పరిధిలో నిర్వహించు తలపెట్టిన పనులు ఇటీవల నిర్వహించిన గ్రామసభలో ఆమోదం తెలపడంతో పనులకు మంగళవారం శ్రీకారం చుట్టారు వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు ఉప సర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్‌తో పాటు గ్రామస్తులు పాల్గొని పనులుకు శ్రీకారం చుట్టారు.

## గౌస్ డ్రైవింగ్ స్కూల్ సహాయం మరువలేనిది



**నందిగామ, ఫిబ్రవరి 4, మేజర్ న్యూస్ :** పట్టణ పరిధిలోని స్థానిక గౌస్ హెవీ మోటర్ డ్రైవింగ్ స్కూల్‌లో ప్రస్తుతం శిక్షణ పొందుతున్నటువంటి కే వెంకట్రావు మాతృమూర్తి వెంకమ్మ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందినందున సదరు విషయం తెలుసుకున్న డ్రైవింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ పఠాన్ గులాం గౌస్ వెంకటరావు కుటుంబానికి తన వంతు ఆర్థిక సహాయాన్ని తన సిబ్బంది ద్వారా అనగా ఎం ఆనంద రావు చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ గౌస్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి తన వంతు సహాయాన్ని అందిస్తానని గతంలో ఎంతోమందికి పెండ్లి కూతుర్లకు పేదవారి పెళ్లిళ్లకు ఆర్థిక సహా యం అందించడం జరిగిందని వృద్ధులకు వితంతువులకు ఎంతోమందికి తన వంతు సహాయాన్ని అందించానని ఆయన తెలియజేశారు ఈ సందర్భంగా మృతురాలి కుమారుడు వెంకట్రావు మాట్లాడుతూ నా యొక్క మాతృ మూర్తి మృతి చెందిన విషయం తెలుసుకొని ఆర్థిక సహాయం అందించిన డాక్టర్ పఠాన్ గులాం గౌస్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ఆయన తెలియజేశారు

# నందిగామ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా మండవ కృష్ణకుమారి







**ఆర్డీవో బాలకృష్ణ ఎన్నికల అధికారిగా కమిషనర్ రమణ బాబు పర్యవేక్షణలో ఎన్నికలు**

**15 మంది ఓట్ల బలంతో మున్సిపాలిటీపై కూటమి జెండా**

**అభివృద్ధిపథంలో మున్సిపాలిటీని ముందుకు తీసుకెళ్తాం : ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య**

**అందరికీ కృతజ్ఞతలు తెలియజేసిన చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి శ్రీనివాస్**

**నందిగామ, ఫిబ్రవరి 4, మేజర్ న్యూస్:** గత కొంతకాలంగా ఎదురుచూస్తున్న మున్సిపల్ చైర్మన్ ఎన్నిక ఎట్టకేలకు మంగళవారం పూర్తయింది. పట్టణంలోని పదో వార్డు కౌన్సిలర్ మండవ కృష్ణకుమారి టిడిపి పార్టీ బీఫామ్ ఇవ్వడంతో 15 ఓట్ల బలంతో చైర్ పర్సన్‌గా ఎన్నికయ్యారు.. మంగళవారం రెండవ రోజు ప్రారంభమైన చైర్మన్ ఎన్నిక సభ్యులను తీసుకొని ఎమ్మెల్యే తంగరాల సౌమ్య పాల్గొన్నారు. ఆర్డిఓ కే బాలకృష్ణ ఆధ్వర్యంలో కమిషనర్ రమణ బాబు పర్యవేక్షణలో ఎన్నికల ప్రక్రియ సక్రమంగా నిర్వహించారు. ఏసీబీ తిలక్, సీఐ వై వి ఎల్ నాయుడు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా తంగిరాల సౌమ్య మాట్లాడుతూ సీఎం చంద్ర బాబు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్,మంత్రులు నారా లోకేష్ నిర్ణయమే మా నిర్ణయం అన్నారు. అధిష్టానం ఆమోదంతోనే కృష్ణకుమారిని చైర్పర్సన్ ఎన్నిక నిర్వహించామన్నారు. సహకరించిన కౌన్సిలర్ అందరికీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. రాబోయే కాలంలో కూటమి నేతృత్వంలో నందిగామ మున్సిపాలిటీ అభివృద్ధి పథంలోకి ముందుకు తీసుకెళ్తామన్నారు. చైర్ పర్సన్ కృష్ణకుమారి మాట్లాడుతూ అధిష్టానం, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, తెలుగు దేశం పార్టీ కుటుంబ సభ్యులు, తోటి కౌన్సిలర్ కు కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారంతో నందిగామ అభివృద్ధికి కృషి చేస్తాను అన్నారు. చైర్మన్ కృష్ణకుమారి భర్త మండవ శ్రీనివాసరావు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, సమన్వయ కమిటీ సభ్యులు గా ఉన్నారు. నందిగామ మండలం రుద్రవరం స్వగ్రామానికి చెందిన శ్రీనివాసరావు 1983 విద్యార్థి దశ నుంచి తెలుగుదేశం పార్టీ అభిమానిగా ఉండేవారు. గతంలో మండల తెలుగు యువత అధ్యక్షులుగా, పట్టణ పార్టీ అధికార ప్రతినిధిగా, జిల్లా తెలుగు యువత నాయకులుగా పదవులు నిర్వహించారు. జగన్ ప్రభుత్వంలో ప్రతిపక్ష పార్టీలో కీలకంగా వ్యవహరించి అక్రమ కేసులో 25 రోజులు జైలు జీవితం గడిపారు. అంతేకాకుండా నందమూరి బాలకృష్ణ సంఘం నాయకుడిగా ఉండి ప్రతి సినిమా రిలీజ్ కి తన అభిమానాన్ని చాటుకునేవారు. శ్రీనివాసరావు వదిన మండవ వరలక్ష్మి మున్సిపల్ చైర్మన్‌గా చేస్తూ గత సంవత్సరం అనారోగ్యంతో మృతి చెందారు. కృష్ణకుమారి శ్రీనివాస్ దంపతులకు అఖిల సాయి, చోప్రసాయి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గత కొన్ని రోజులుగా నందిగామ మున్సిపల్ చైర్మన్ గా ఎవరు అని ఉత్కంఠంగా సాగిన ఎన్నికలకు ఎట్టకేలుగా తెరపడింది. మున్సిపాలిటీ పట్టణ ప్రజలకు రాజకీయ నాయకులకు నాయకురాలిని నమ్ముకున్న కార్యకర్తకు ఎప్పుడు అన్యాయం జరగదనే విధంగా మరో కొత్త పేరుతో అనూహ్యంగా కౌన్సిలర్ మండవ కృష్ణకుమారిని చైర్మన్‌గా ఎన్నుకున్నారు. నియోజకవర్గంలో మొన్న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఘన విజయానికి పునాది వేసిన తంగిరాల సౌమ్య నిర్ణయానికి శిరసా వహించిన మిగతా తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్ లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ నందిగామ శాసనసభ్యులు తంగిరాల సౌమ్య నిర్ణయానికి అన్ని విధాలా మద్దతు తెలిపి మండవ కృష్ణ కుమారి ని నందిగామ చైర్మన్‌గా ఎన్నుకున్న తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులందరికీ మున్సిపల్ చైర్మన్ మండవ కృష్ణకుమారి ధన్యవాదములు తెలిపారు.


కుటుంబ సభ్యులతో మండవ కృష్ణకుమారి శ్రీనివాస్





18 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు **ఎన్.వెంకట్,** ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999




